క్లుప్తంగా

గ్రామ పండగలతో సంప్రదాయాల పరిరక్షణ



మోదకొండమ్మను సన్నిధిలో వైఎస్సార్ సీపీ మహిళావిభాగం జిల్లా అధ్యక్షురాలు అనురాధ

మాడుగుల : గ్రామ దేవతల పండగల ద్వారా అలనాటి సంస్కృతీ సంప్రదాయాలు నేటి తరానికి తెలుస్తున్నాయని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ అన్నారు. మండలంలోని వీరనారాయణం గ్రామంలో ఆదివారం నిర్వహించిన మోదకొండమ్మ పండగలో పాల్గొన్నారు. మోదకొండమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు గ్రామ మహిళలు హారతులు పట్టి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లపు కొండప్పారావు, పీఏసీఎస్ అధ్యక్షులు విస్సారపు రామారావు, మాజీ సర్పంచ్ తూరుబిల్లి సత్తింబాబు, సహకార సంఘ సీఈవో తూరుబిల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సూర్యనారాయణ

కె.కోటపాడు : వేసవి సమయాల్లో సామాజిక బాధ్యతతో గ్రామాల కూడళ్లలో చలివేంద్రాల ఏర్పాటు చేయాలని సత్యసాయి భక్తుడు కన్నూరు సూర్యనారాయణ అన్నారు. కూండ్రపువానిపాలెం కూడలి వద్ద రావాలమ్మ తాపీ మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సూర్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో అలుగోజు వెంకటరమణ, దేముడుబాబు, అప్పారావు, సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు



జల్ జీవన్ మిషన్ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

మాకవరపాలెం: ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ అన్నారు. మండలంలోని జంగాలపల్లిలో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.20 లక్షలతో చేపట్టనున్న తాగునీటి కుళాయి పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసి నీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జంగాలపల్లి మాజీ సర్పంచ్‌లు సింగంపల్లి కొండబాబు, అల్లు అప్పలనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శివారెడ్డి పాల్గొన్నారు.

225 మందికి వైద్య సేవలు



శిబిరంలో కంటి రోగులును పరీక్షిస్తున్న వైద్యులు

మాడుగుల రూరల్ : మండలంలోని డి.గొటివాడలో కేజే పురం భానోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో కంటి, గుండె, ఇతర వ్యాధిగ్రస్తులు 225 మందిని పరీక్షించారు. వీరిలో 48 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని సోమవారం అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తీసుకెళ్లి, ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించను న్నట్లు భానోదయ సంస్థ చైర్మన్ రాపేట రామకొండలరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ హరికృష్ణ, రొబ్బ రాజు, రొబ్బ శంకర్, కోయ్యన్న వెంకటేష్, ఆస్పత్రి వైద్యులు, క్యాంప్ మేనేజర్ ఉదయ్ పాల్గొన్నారు.

మొరాయించిన జియో

మాడుగుల రూరల్ : జియో నెట్‌వర్క్ మొరాయించడంతో కె.జె.పురం గ్రామస్తులు గత పది రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని సెల్ ఫోన్ వినియోగదార్లు ఎక్కువగా జియో వినియోగిస్తున్నారు. జియో 5జీ సేవల్ని అందుబాటులోకి తెచ్చేందుకు గానుటవరు మార్పు చేస్తుండటం వల్లే ఈ సమస్య తలెత్తినట్టు తెలిసింది. నెట్‌వర్క్ సేవల్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. రెండు మండలాలకు నరకం

- నరుగుడు–చమ్మచింత రోడ్డుకు రూ.12 కోట్లు
- కల్వర్టు నిర్మించి, రోడ్డు విస్తరణ చేపట్టని కాంట్రాక్టర్
- ఇప్పటికే రూ.3.50 కోట్ల బిల్లుల చెల్లింపు



రోడ్డు మధ్యలో కాలువపై నిర్మించిన కల్వర్టు



చమ్మచింత సరుగుడు మధ్య విస్తరించాల్సిన రోడ్డు

నాతవరం: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. రెండు మండలాల ప్రజల ఇక్కట్లను పెంచుతోంది. సకాలంలో పూర్తికావాల్సిన రోడ్డు పనులు కేవలం కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే పూర్తికావట్లేదని స్థానికుల ఆక్షేపణ. ఉమ్మడి జిల్లాలో నాతవరం, కొయ్యూరు మండలాల సరిహద్దు చమ్మచింత నుంచి సరుగుడు వరకు 12 కి.మీ. మేర రోడ్డు విస్తరణకు అర్ అండ్ బీ రూ.12 కోట్లు మంజూరు చేసింది. ముందుగా చేసుకున్న ఒప్పందం మేరకు ఈ రోడ్డు పనులు గత నెలకే పూర్తి కావాలి. ప్రస్తుత పనుల తీరును పరిశీలిస్తే.. ఈ ఏడాదికైనా పూర్తవుతుందో.. లేదో తెలియని అయోమయం నెలకొంది.

నాతవరం, కొయ్యూరు మండలాల్లోని చాలా గ్రామాల రాకపోకలకు ఇదే ప్రధాన మార్గం. అయా గ్రామాలకు సరుగుడు, ఆడాకుల ఆర్టీసీ బస్సు నర్సీపట్నం డిపో నుంచి ఈ రోడ్డుపై నుంచే ప్రయాణించాలి. రోడ్డు పనుల్లో జాప్యం కారణంగా ఈ రూటులో తిరిగే బస్సు సర్వీసును కొంత కాలంగా నిలిపేశారు. పరస్తుతం రోడ్డుపై కల్వర్టు పనులు పూర్తి కావడంతో బస్సు సర్వీసును పునరుద్ధరించారు. రోడ్డు పనులు అసంపూర్తిగా చేసి వదిలేయడంతో ప్రయాణికులు ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే ఏళ్ల తరబడి పడుతున్న రహదారి కష్టాలు తీరుతాయని స్థానికులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కాంట్రక్టర్, అధికారులు నిర్లిప్తతను వదలి, వీలైనంత వేగంగా రోడ్డు నిర్మాణపనులను పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

కాంట్రాక్టర్‌కు నోటీసులు

రోడ్డు పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం. ఇంత వరకు పూర్తి చేసిన రోడ్డు పనులకు రూ.3.50 కోట్లు చెల్లించాం. కల్వర్టు నిర్మించి, రోడ్డు విస్తరణ పనులు చేయాలి. పనుల్లో నిర్లక్ష్యంపై నోటీసులు జారీ చేశాం. పనులు పూర్తికాకపోతే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం.

– జయరాజ్, జేఈ, ఆర్ అండ్ బీ

రూ.3.33 కోట్లతో రోడ్లకు శ్రీకారం



కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శారదాజానకిరాం

చీడికాడ : ఏళ్లనాటి కల డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో సాకారమవుతోందని జెడ్పీటీసీ లాలం శారదాజానకిరాం అన్నారు. రూ.3.33 కోట్లుతో నిర్మించనున్న మూడు గ్రామాల మధ్య లింకు రోడ్లకు ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని తురువోలు నుంచి పాత్రినివారి కల్లాలు మీదుగా చీడికాడ శివారు కొండవీధి రోడ్డు(2.5 కి.మీ.)కు రూ.1.68 కోట్లు, తరువోలు నుంచి చొక్కాకుల వారి కల్లాలు మీదుగా తంగుడుబిల్లికి వెళ్లే రోడ్డు(1.6 కి.మీ.)కు రూ.1.65 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ మూడు గ్రామాల ప్రజల తరపున సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు తురువోలు, తంగుడుబిల్లిలో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టా అప్పారావు, వైఎస్సార్ సీపీ నేతలు లాలం శివకుమార్, చొక్కాకుల కోటి, పోతల అచ్చిబాబు, బలిజి దేముళ్లు, జె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోటలో 'గడప గడపకు' నేడు

రావికమతం : కొత్తకోట 3వ సచివాలయ పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకన్నబాబు ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొని ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాల అమలుతీరు, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. అన్ని శాఖల అధికార్లు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు సంబంధిత రికార్డులతో హాజరు కావాలని సూచించారు.

పక్కాగా సరిహద్దు రాళ్ల ఏర్పాటు

మాకవరపాలెం : రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దు రాళ్లను పక్కాగా ఏర్పాటు చేయాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పి.పి.అగ్రహారం, సీతన్న అగ్రహారంలో జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో రీ సర్వే పూర్తి కావడంతో సరిహద్దు రాళ్లు వేసే పనులు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఆర్డీవో ఆదివారం పరిశీలించారు. రైతుల సమక్షంలో రాళ్లను ఏర్పాటు చేయాలని సిబ్బందిని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండలు మండుతున్నాయ్



ఎండలకు నిర్మానుష్యంగా మారిన కె.కోటపాడు రోడ్డు



గొలుగొండలో మధ్యాహ్నం సమయంలో జనసంచారం లేని దృశ్యం

కె.కోటపాడు/గొలుగొండ : ఉష్ణతాపం రోజురోజుకూ పెరుగుతోంది. గ్రామాల్లో వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండలు ప్రతాపం చూపిస్తున్నాయి. సాయంత్రం 5 గంటలైనా వేడిమి తగ్గట్లేదు. దీంతో రోడ్లపైకి రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. అత్యవసరమైతే తప్ప, బయటికి వచ్చే సాహసం చేయలేకపోతున్నారు. ఎండ తీవ్రత వలన కె.కోటపాడు, గొలుగొండ మండలాల్లోని ప్రధాన రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు వేసవి ఉష్ణోగ్రతలకు గ్రామాల్లో సాగులో ఉన్న కాయగూరల పంటలు వడలిపోతున్నాయి.

పాడి రైతులకు అండగా విశాఖ డెయిరీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామధర్మజ తదితరులు

మాడుగుల : పాడి రైతులుకు అండగా విశాఖ డెయిరీ పని చేస్తుందని ఎంపీపీ వేమవరపు రామధర్మజ అన్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషి ఫలితంగా స్థానిక పశువైద్యశాల మరమ్మతులకు మంజూరైన రూ.2.90 లక్షలతో పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలో పాడి రైతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సంస్థ విశాఖ డెయిరీ అని తెలిపారు. ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వి.చిట్టినాయుడు మాట్లాడుతూ శిథిలమైన పశువైద్యశాల స్థితిని డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి, నిధులకు కృషి చేసిన ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు. మరమ్మతు పనులు పూర్తయితే పాడి రైతులుకు మరిన్ని సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉపసర్పంచ్ శ్రీనాదు శ్రీనివాసరావు, పాల సంఘం అధ్యక్షులు రావెలపూడి సూరిబాబు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



మాడుగుల బస్టాండ్ వద్ద అగ్నిమాపక దళం మాక్‌డ్రిల్‌లో ఫైర్ అధికారి రాజేశ్వరరావుతో సిబ్బంది



కరపత్రాలను పంపిణీ చేస్తున్న అగ్నిమాపక అధికారి స్వామి, సిబ్బంది

మాడుగుల : జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక బస్టాండ్‌లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. భారీ అగ్నిప్రమాదాలపుడు అప్రమత్తతపై ఫైర్ సిబ్బంది నిర్వహించిన మాక్ డ్రిల్‌ను గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపీటీసీలు పాలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, ఫైర్ అధికారి రాజేశ్వరరావు, లీడింగ్ ఫైర్‌మెన్ కృష్ణ, సిబ్బంది మణికుమార్, రమేష్, చిన్నంనాయుడు, కె. నరింగరావు, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం : వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ఫైర్ అఫీసర్ పి.ఎ.స్వామి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని అపార్టుమెంట్లలో ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని విపత్తులను ఎదుర్కొనే విధానాలతో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

గృహిణులకు గ్యాస్ వాడకంలో జాగ్రత్తలు

చోడవరం రూరల్ : గ్యాస్ వాడకంలో గృహిణులు పాటించాల్సిన జాగ్రత్తలు, మంటలు వ్యాపిస్తే తీసుకోవాల్సిన చర్యలను అగ్నిమాపక సిబ్బంది ప్రయోగాత్మకంగా చూపించి మహిళలను చైతన్య పరిచారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని కోఆపరేటివ్ కాలనీ బాలాజీ రెసిడెన్సీలో అగ్ని ప్రమాద నివారణపై అవగాహన కల్పించారు. చోడవరం ఫైర్ స్టేషన్ ఆఫీసర్ పి.వి.రామస్వామి, సిబ్బంది గృహిణులకు గ్యాస్‌తోపాటు, ఎలక్ట్రిక్ సామాన్లు, వైరింగ్ లోపాల వల్ల వాటిల్లే అగ్నిప్రమాదాలు, నివారణ చర్యలను వివరించారు.

శరవేగంగా పూడిమడక రహదారికి మరమ్మతులు



చురుగ్గా పూడిమడక రోడ్డుకు మరమ్మతు పనులు

మునగపాక : ఎట్టకేలకు పూడిమడక రోడ్డుకు మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. అనకాపల్లి బైపాస్ జంక్షన్ నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల రహదారి దెబ్బతినడంతో నిత్యం రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడేవారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల స్థానిక ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకురావడంతో అధికారులు స్పందించారు. ప్రస్తుతం రహదారి మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి.

అప్రోచ్ రోడ్డుతో మార్గం సుగమం

మునగపాక : తోటాడ త్రిమూర్తుల ఆలయం ఎదురుగా ఉన్న రహదారికి ఇరువైపులా అప్రోచ్ రోడ్డు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. సంబంధిత పనులను ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత షేక్ ఇస్మాయిల్ సంయుక్తంగా పరిశీలించారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఎంపీటీసీ వెంకటలక్ష్మి రూ.6 లక్షల మేర నిధులు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈ అప్రోచ్ రోడ్డు పూర్తయితే 10 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలుంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మళ్ల మహాలక్ష్మినాయుడు, కాండ్రేగుల సత్యనారాయణ, బుద్ద రవి, దొడ్డి శ్రీధర్, కాండ్రేగుల శేషు, పాలమరశెట్టి నరేంద్ర, గ్రామశాఖ అధ్యక్షుడు బొడ్డేడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఊరూరా పండగలా 'జగనన్నే మా భవిష్యత్తు'



కొత్తపెంట ర్యాలీలో పాల్గొన్న జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ రొంగలి వెంకటరావు



చౌడువాడలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న రాజేష్



ఎం.కోడూరులో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ప్రగతిని వివరిస్తున్న గొల్లవిల్లి తదితరులు



పాతమల్లంపేటలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న దృశ్యం

దేవరాపల్లి : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం గ్రామాల్లో పండగలా సాగుతోందని జెడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. ఈ మేరకు కొత్తపెంటలో స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి తేడాను వివరించారు. ప్రజా మద్దతు పుస్తకంలో ప్రశ్నలను అడిగి, సమాధానాలు నమోదు చేసుకున్నారు. యజమాని అనుమతితో ప్రతీ ఇంటికి, సెల్‌ఫోన్‌కు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రొంగలి శంకరరావు, ఉప సర్పంచ్ కొత్తల అప్పలనర్సమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు రెడ్డి అప్పారావు, సచివాలయ కన్వీనర్లు చిరికి శంకరరావు, కొత్తల సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట : మండలంలోని పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం వేడుకగా నిర్వహించారు. ప్రజల నుంచి విశేష అదరణ దక్కింది. ప్రజలు తమ ఇష్టపూర్వకంగానే మా నమ్మకం నువ్వే జగన్ పేరిట ఉన్న స్టిక్కర్లను వారి ఇళ్లకు అతికించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రూపొందించిన బ్రోచర్లను జగ్గంపేటలో సర్పంచ్, ఉప సర్పంచ్‌లు బగుడు వెంకటరమణ, కాలింగ జోగినాయుడు ఇంటింటా తిరిగి పంచిపెట్టారు. గత ప్రభుత్వానికి, తమ ప్రభుత్వానికి మధ్య పాలనా వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమాన్ని బుచ్చింపేటలో సర్పంచ్ ఉలబాల చంద్ర, ఎంపీటీసీ సత్యవతి, కుసుర్లపూడిలో మద్దు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు శనివారం రాత్రి, ఆదివారం నిర్వహించారు.

మాడుగుల రూరల్ : నేరుగా ప్రజల ఇంటికే సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని ఎం.కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, చింతా వెంకటనారాయణ మూర్తి, హైస్కూలు కమిటీ చైర్మన్ కోన అన్నపూర్ణ పాల్గొన్నారు.

- తాటిపర్తి గ్రామ పంచాయతీ పరిధి బిళ్లలుపాలెం, కాశీపురం, గరికబంద తదితర గ్రామాల్లో సర్పంచ్ అల్లంగి వెంకట గౌరీదేవి, మాజీ సర్పంచ్ అల్లంగి సంజీవ్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను గోడలపై అతికించారు .
- శంకరం గ్రామంలో సర్పంచ్ శోలం రమేష్, ఇతర ప్రజా ప్రతినిధుల సారథ్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

గొలుగొండ : మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. పాతమల్లంపేట పంచాయతీలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, గొలుగొండలో సర్పంచ్ కసిపల్లి బుజ్జి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో గృహసారథులు, నాయకులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : రాష్ట్రంలో కులం, మతం, పార్టీలు అన్న తేడా లేకుండా అర్హతే ప్రామాణికంగా సీఎం జగన్ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని జేసీఎస్ మండల కన్వీనర్ ఏటుకూరి రాజేష్ అన్నారు. చౌడువాడ గ్రామంలో ఆదివారం నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి, నాలుగేళ్ల జగన్ పాలన, గత ప్రభుత్వంలో చంద్రబాబు బూటకపు హామీల మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. సీఎం జగన్‌కు ఎల్లప్పుడూ మద్దతుగా ఉండాలని స్థానికులను కోరారు.

'మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి'



కె.కోటపాడులో ప్రచార భేరీని జెండా ఊపి ప్రారంభిస్తున్న వెంకటరమణ

కె.కోటపాడు : దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్న మోదీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గద్దె దించాలని ప్రజలను సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో సీపీఐ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచార భేరీ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలతో పాటు విశాఖకు రైల్వే జోన్ ఇచ్చే వరకూ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, మండల కార్యదర్శి గొర్లె దేముడుబాబు, రెడ్డి అప్పలనాయుడు, పొంతపల్లి రామారావు, ఇల్లాకు రాము పాల్గొన్నారు.

వేసవిలో ఆరోగ్యంపై అప్రమత్తం



పీహెచ్‌సీ వైద్యాధికారి కె.లీలాప్రసాద్

మాడుగుల రూరల్ : వేసవి కాలంలో ప్రతి ఒక్కరు ఆరోగ్య జాగ్రతలు తీసుకోవాలని కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.లీలాప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన వేసవిలో తీసుకోవల్సిన జాగ్రతలపై సాక్షితో మాట్లాడారు. సూచనలు ఆయన మాటల్లో..

- వేసవిలో ఉదయం 6 గంటల నుంచి 10 గంటల్లోపు వ్యవసాయ పనులు ముగించుకోవాలి. వీలైనంత మేరకు నీడ ప్రదేశంలో పనిచేయాలి.
- తెల్లని, వదులుగా ఉన్న కాటన్ దుస్తులు ధరించడం శ్రేయస్కరం.
- దుకాణాల్లోని పానీయాల కంటే ఇంట్లో సొంతంగా తయారు చేసుకునే వాటికి ప్రాధాన్యతివ్వండి.
- మజ్జిగ, భార్లీతో పాటు లేత కొబ్బరి నీళ్లు, వైద్య ఆరోగ్యశాఖ అందించే ఓఆర్ఎస్ ద్రావణం తీసుకుంటే వేసవి తాపం నుంచి ఉపశమనం కలుగుతుంది.
- సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, ఆశ, ఆరోగ్య కార్యకర్తల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాం.
- చిటికెడు ఉప్పు, చారెడు పంచదార నీటిలో కలిపి ఇంట్లోనే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తయారు చేసుకోవచ్చు.
- బయటకు వెళ్లేటప్పుడు గొడుగులు వాడాలి.
- వడదెబ్బ బారిన పడిన వారిని నీడలో పడుకోబెట్టి, ముఖం మీద చల్లని నీటితో కడిగి, మజ్జిగ, లేదా నీరు త్రాగించాలి.
- నాలుక పొడిబారిన, కళ్లు లోపలికి పోయినా, చర్మం సాగేలా ఉన్నా, బీపీ, సుగర్‌లో మార్పులు వచ్చినా వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రం, ఆస్పత్రికి తరలించాలని సూచించారు.

20 నుంచి ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ

అనకాపల్లిటౌన్ : స్థానిక పూర్ణమి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు టెన్త్ ఉతీర్ణత సాధించిన విద్యార్థులకు ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ తరగతులు ఇవ్వనున్నట్టు సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ నారాయణరావు ఆదివారం పేర్కొన్నారు. ఉచిత శిక్షణ నిష్ణాతులైన అధ్యాపకులిస్తారని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఆయన కోరారు.

పుస్తకాలే మంచి స్నేహితులని గుర్తించాలి



మా ఊళ్లో గ్రంథాలయం కార్యదర్శి సంజీవరావుతో బహుమతుల విజేతలు

మునగపాక : విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని మాఊళ్లో గ్రంథాలయం కార్యదర్శి యల్లపు సంజీవరావు అన్నారు. పోటీ పరీక్షల్లో రాణించాలంటే లక్ష్యం అవసరమన్నారు. మా ఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా విద్యార్థులకు చదవడం,రాయడంపై మరింత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. శిక్షణలో మంచి ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆదివారం బహుమతులు అందజేశారు. పుస్తకాలే మనకు మంచి స్నేహితులుగా గుర్తించాలని, అలాగే చదువులో ఆసక్తి చూపాలని సంజీవరావు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఏవీఎస్ మూర్తి, విశ్రాంత ఉపాధ్యాయుడు దక్షిణామూర్తి పాల్గొన్నారు.